## 3.1 పరిచయం

పటిష్టమైన అంతర్గత నియంత్రణలు కలిగి ఉండడం, నియమాలూ, పద్ధతులను పాటించడం సుపరిపాలనకు ప్రముఖంగా తోడ్పడతాయి. యుక్తమైన, విశ్వసనీయమైన, సత్వర ఆర్థిక విషయాల నివేదన జరిగేలా భరోసానివ్వడం ద్వారా, రాష్ట్ర ప్రభుత్వం తన మౌలిక కార్యనిర్వాహక బాధ్యతలను నిర్వర్తించడంతోపాటు, వ్యూహాత్మక ప్రణాళికా రచనలోనూ, తగు నిర్ణయాలను తీసుకోవడంలో కూడా ఇవి సహాయపడతాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం వివిధ ఆర్థిక నియమాలు, పద్ధతులు, నిర్దేశాలను అనుసరించిన వైనం ఈ అధ్యాయంలో పరిశీలించటం జరిగింది.

## 3.2 వినియోగ ధృవపత్రాలు

వివిధ సామాజిక, ఆర్థికాభివృద్ధి పథకాల అమలు కోసం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి వినియోగ ధృవపత్రాలను పంపించాలి. మచ్చుకు ఐదు ముఖ్యమైన పథకాల[1] అమలు తీరును, ఆర్థిక సంఘం గ్రాంట్లను తనిఖీ చేయగా, 2013 మార్చి 31 నాటికి కేంద్ర ప్రాయోజిత పథకాల కోసం విడుదల చేసిన ₹ **1,749** కోట్ల నిధులకు సంబంధించి వినియోగ ధృవపత్రాలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సమర్పించవలసి వున్నట్లు వెల్లడైంది. అంతేకాక, సాంఘిక భద్రతా పింఛనుకు, సంపూర్ణ పారిశుధ్య పథకానికి సంబంధించి ₹ **635** కోట్ల మొత్తానికి విభాగాధికారుల నుండి వినియోగ ధృవపత్రాలు బకాయిలో ఉన్నాయి (***అనుబంధం 3.1***).

అలాగే, ఏదైనా నిర్దిష్ట ప్రయోజనాల కోసం ఇచ్చిన గ్రాంట్ల విషయంలో సంబంధిత శాఖాధికారులు ఆయా గ్రాంట్లను పొందిన సంస్థలనుండి వినియోగ ధృవపత్రాలను తెప్పించుకొని, వాటిని పరిశీలించి పీఏజీ (ఏ&ఇ)కి సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు[2] నిర్దేశిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 1992-93 నుంచి 2012-13 మధ్యకాలంలో ఇచ్చిన మొత్తం ₹ 4.68 కోట్ల గ్రాంట్లకు సంబంధించి 19 వినియోగధృవపత్రాలు 2013 మార్చి 31 నాటికి రావలసి ఉన్నాయి. వీటివిషయంలో జాప్యం ***అనుబంధం 3.1(ఎ)***లో వివరించిన విధంగా ఒక సంవత్సరం నుంచి 21 సంవత్సరాల వరకూ ఉన్నది.

అనేక సామాజిక, ఆర్థికాభివృద్ధి పథకాలను పరిశీలించగా, వివిధ విభాగాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం, నిధులను తమ కింది స్థాయి అధికారులకు విడుదల చేసిన వెంటనే లేదా పీడీ ఖాతాల్లో ఉంచి, వాటిని ఖర్చు చేయకముందే వినియోగ ధృవపత్రాలను సమర్పిస్తున్నట్లు వెల్లడైంది. ఉదాహరణకు, రాజీవ్ గాంధీ జాతీయ తాగునీటి పథకం మొదటి విడత 3449, రెండవ విడత 6169 గ్రామీణ పాఠశాలల్లో ప్రత్యేక నీటి శుద్ధి వ్యవస్థలను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ₹ 19.23 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి మంజూరు చేసింది (2009 జనవరిలో ₹ 6.90 కోట్లు, 2010 మార్చిలో ₹ 12.33 కోట్లు). దీనికిగాను, 2009-10 సంవత్సరంలో ₹ 3.20 కోట్లు (46 శాతం) ఖర్చు చేయగా 2013 మార్చి నాటికి ₹ 16.03 కోట్ల మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకోవలసి ఉంది. ఐతే, మొదటి విడత వచ్చిన ₹ 6.90 కోట్ల మొత్తానికి 2010 మార్చిలోనే కేంద్ర ప్రభుత్వానికి వినియోగ ధృవపత్రాలను పంపింది.

*ఆడిట్ కనుగొన్న విషయాలను ప్రభుత్వం అంగీకరించింది (2013 డిశంబరు). వినియోగ ధృవపత్రాలను పీఏజీ (ఏ&ఇ)కి వెంటనే పంపవలసిందిగా రెవెన్యూ, పంచాయతీరాజ్, మునిసిపల్ పాలన-పట్టణాభివృద్ధి శాఖలను ఆదేశించినట్లు కూడా ప్రభుత్వం తన సమాధానంలో తెలిపింది.*

---

[1] సాంఘిక భద్రతా పింఛనులు, పీఎమ్‌జీఎస్‌వై, ఐఏవై, గిరిజన సంక్షేమం, బీడబ్ల్యూహెచ్‌పీ

[2] ఆంధ్ర ప్రదేశ్ ఫైనాన్షియల్ కోడ్‌లోని అధికరణం 211 ఎ (2) కింద నోటు 1

## 3.3 స్వయంపాలక సంస్థల పద్దులు/ఆడిట్ నివేదికల సమర్పణ

వైద్య విద్య, గిరిజన సంక్షేమం, పట్టణాభివృద్ధి మొదలైన రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం పలు స్వయంపాలక సంస్థలను ఏర్పరచింది. ఇలాంటి 18 సంస్థల పద్దుల తనిఖీని భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్‌కి అప్పగించడం జరిగింది. ఐతే, 2012-13 నాటికి ఈ 18 సంస్థలలో 15 సంస్థలు తమ వార్షిక పద్దులను అందచేయలేదు. తనిఖీ కోసం పద్దులను సమర్పించడంలో జరిగిన జాప్యం (2013 సెప్టెంబరు నాటికి) మూడు నెలల నుండి 111 నెలల వరకూ ఉంది. ఈ బకాయిల వివరాలు ***అనుబంధం 3.2*** లో ఉన్నాయి.

ఆర్థికపరమైన అవకతవకలు ఏమైనా జరిగి ఉంటే వాటిని గుర్తించేందుకుగాను నిర్దిష్ట కాలపరిమితిలో పద్దులను రూపొందించి తనిఖీకి సమర్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టవలసిన అవసరం ఉంది.

అంతేగాక, భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (విధులు, అధికారాలు, సర్వీసు నిబంధనలు) చట్టం, 1971లోని 14, 15 సెక్షన్ల కింద ఏఏ సంస్థలు ఆడిట్ పరిధిలోకి వస్తాయో గుర్తించడానికిగాను ఆయా సంస్థలకు ఇచ్చిన ఆర్థిక సహాయం మొత్తం, ప్రయోజనం, సంస్థల మొత్తం వ్యయం మొదలైన వివరాలను ప్రభుత్వం/శాఖాధిపతులు విధిగా ప్రతి సంవత్సరం ఆడిట్‌కు తెలియచేయాలి. ఐతే, 1993-94 నుండి 2012-13 సంవత్సరం వరకు ఆర్థిక సహాయం పొందిన 368 సంస్థలు 2013సెప్టెంబరు వరకు తమ పద్దులు (మొత్తం 1862) ఆడిట్‌కు సమర్పించలేదు. ఈ పద్దుల వివరాలు ***అనుబంధం 3.3*** లో ఇవ్వడమైంది.

## 3.4 రికన్సిలియేషన్ చేయని ఖర్చులు, రాబడులు

ఖర్చును బడ్జెట్ గ్రాంట్ల పరిధిలోనే ఉంచుతూ, వాటి పద్దుల ఖచ్చితత్వానికి భరోసాయిస్తూ, ప్రభావవంతంగా నియంత్రించుటకు గాను వివిధ శాఖల నియంత్రణాధికారులను సమాయత్తం చేయడానికి వారి పుస్తకాలలో, ఆ ఆర్థిక సంవత్సరంలో నమోదైన నెలవారీ ఖర్చును పిఏజి (ఏ&ఇ) పుస్తకాలలోని ఖర్చుతో సరిపోల్చుకోవాలని ఆర్థిక నియమాలు[3] నిర్దేశిస్తున్నాయి. ప్రభుత్వ శాఖలు తమ పద్దులను సరిపోల్చుకోకపోవడాన్ని ఆడిట్ రిపోర్టులలో పదేపదే ఆక్షేపించినాగానీ, ఈ విషయంలో నియంత్రణాధికారుల లోపాలు 2012-13 సంవత్సరంలో కూడా కొనసాగాయి. 2012-13 లో అయిన ₹ 30,815 కోట్ల ఖర్చును (మొత్తం ఖర్చు[4]లో 25 శాతం) 256 మంది నియంత్రణాధికారులు 2013 జూన్ నాటికి రికన్సయిల్ చేయలేదు. 14 మంది నియంత్రణాధికారులకు సంబంధించి ప్రతి కేసులోనూ ₹ 500 కోట్లు, అంతకు మించిన రికన్సయిల్ చేయని ఖర్చు వివరాలు ***అనుబంధం 3.4*** లో ఇవ్వడమైంది.

అంతేగాక, ప్రతీ నియంత్రణాధికారి, తమ కింది అధికారులనుండి వారు పొందిన/ఖజానాలో జమచేసిన సొమ్ముకు సంబంధించిన పద్దులను, నివేదికలను క్రమం తప్పకుండా తెప్పించుకొని పీఏజి (ఏ&ఇ) అంకెలతో వాటిని సరిపోల్చుకొని, ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు వీలైనంత త్వరగా లెక్కలలో తేడాలను రికన్సయిల్ చేసుకోవాలి. అయినప్పటికీ 2012-13 సంవత్సరంలో 42 పద్దుల కింద ₹ 50,160 కోట్లు (మొత్తం రాబడులలో[5] 48 శాతం) రాబడులను సంబంధిత నియంత్రణాధికారులు రికన్సయిల్ చేయలేదు.

2012-13 సంవత్సరానికి, నియమ నిబంధనలను పాటించటం, బడ్జెట్ నిబంధనలను అనుసరించటం, రిస్క్ నిర్వహణకు తగినంత నియంత్రణ వ్యవస్థను కలిగిఉండటం వంటి విషయాల్లో పీఏజి (ఏ&ఇ) 620 నియంత్రణాధికారుల నుండి భరోసా కోరగా, కేవలం 19 మంది మాత్రమే దీనికి అనుగుణంగా స్పందించారు. మిగిలిన 601 మంది నియంత్రణాధికారులు స్పందించలేదు (2013 ఆగస్టు).

*ప్రధాన నియంత్రణాధికారులందరూ తమ పద్దులను ప్రతినెలా తప్పనిసరిగా పీఏజీ (ఏ&ఇ) లెక్కలతో రికన్సయిల్ చేసుకోవాలని ఆదేశించినట్లు ప్రభుత్వం చెప్పింది (2013 డిశంబరు).*

---

[3] ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కోడ్‌లోని ఆర్టికల్ 9

[4] రెవెన్యూ, క్యాపిటల్ మరియు లోన్లు, అడ్వాన్సులుతో కలిపి (₹ 1,21,764 కోట్లు)

[5] రెవెన్యూ, క్యాపిటల్ మరియు లోన్లు, అడ్వాన్సులుతో కలిపి (₹ 1,04,256 కోట్లు)

## 3.5 వ్యక్తిగత డిపాజిట్ ఖాతాలు

ఆంధ్రప్రదేశ్ ఫైనాన్సియల్ కోడ్[6] ప్రకారం, ప్రభుత్వం ప్రత్యేక శాసనం ద్వారా ఉత్పన్నమయ్యే తన బాధ్యతలను నిర్వర్తించేందుకు వీలుగా, సంచిత నిధికి డెబిట్ చేసి పీడీ ఖాతాలు తెరుచుకునే సదుపాయాన్ని కల్పించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల (2000 ఏప్రిల్) ప్రకారం, ఒక నిర్దిష్ట ఆర్థిక సంవత్సరంలో విడుదల చేసిన నిధులు తదుపరి ఆర్థిక సంవత్సరం మార్చి 31 నాటికి మురిగిపోతాయి (క్యాటగిరి ' సి ' కింది కాలదోషం పట్టిన డిపాజిట్లు). పి.డి. ఖాతాల నిర్వహణాధికారులు కాలదోషం పట్టిన ఖాతాలను మూసివేసి వాటిలోని ఖర్చుకాని మిగులు నిధులను తిరిగి ప్రభుత్వ ఖాతాకు విధిగా బదిలీచేయాలి. 2012-13 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ₹ **374.28** కోట్లు మురిగి పోయిన డిపాజిట్లను, తిరిగి ప్రభుత్వ ఖాతాకు బదిలీ చేయనట్లు మచ్చుకు చేసిన తనిఖీలో వెల్లడైంది. పి.డి. ఖాతా నిర్వహణాధికారి వారీగా వివరాలు పీఏజి (ఏ&ఇ)కు సమర్పించకపోవడం వల్ల, పీడీ ఖాతాకు బదిలీ చేసిన నిధుల నుండి చేసిన ఖర్చును, ఖర్చుకాక ప్రభుత్వ ఖాతాకు బదిలీచేసిన మిగులు నిధులను, ఆడిట్‌లో పరిశీలించటం సాధ్యపడలేదు.

2013 మార్చి 31 నాటికి ₹ 13,090 కోట్ల ముగింపు మిగులుతో 1,02,520 పి.డి. ఖాతాలు నిర్వహణలో ఉన్నట్లు జిల్లా ఖజానాల అధికారుల రికార్డులను బట్టి తెలుస్తోంది. 2011-12 సంవత్సరపు ముగింపు మిగులుకు, 2012-13 సంవత్సరపు ప్రారంభ మిగులుకు 14,030 పీడీ ఖాతాలకు(పెరిగింది) సంబంధించి ₹ 9,212 కోట్ల వ్యత్యాసం ఉంది(తగ్గింది). దీన్ని సంబంధిత శాఖలు రికన్సయిల్ చేసుకోలేదు. ఐతే, తమ వద్ద 2012 మార్చి 31 నాటికి ₹ 23,483 కోట్ల నిల్వతో 1,16,638 పీడీ ఖాతాలు ఉన్నట్లు డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ & అకౌంట్స్(డీటీఏ) తెలియజేశారు(2012 జూలై). 2013 మార్చి 31 నాటికి ఉన్న పీడీ ఖాతాల వివరాలు తెలపవలసిందిగా స్పష్టంగా కోరినప్పటికీ డీటీఏ ఇంత వరకు తెలుపలేదు (2013 అక్టోబరు). ***డీటీఓలు, డీటీఏ ఇచ్చిన సంఖ్యలలోనూ, ప్రారంభ, ముగింపు నిల్వలలోనూ ఉన్న వ్యత్యాసం నిధుల నిర్వహణ వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపుతోంది.***

రాష్ట్రంలో ఉన్న మొత్తం 1,02,520 పీడీ ఖాతాల్లో 23,317 ఖాతాలు గ్రామపంచాయితీలు/మండల ప్రజా పరిషత్‌లు/జిల్లా ప్రజా పరిషత్తుల్లాంటి అనేక పంచాయితీ రాజ్ సంస్థలకూ (పీఆర్ఐ), నగర పంచాయితీలు/మునిసిపాలిటీలు/మునిసిపల్ కార్పోరేషన్‌లు లాంటి మునిసిపల్ సంస్థలకు చెందినవి. పంచాయితీ రాజ్ చట్టం, 1994 మరియు మునిసిపాలిటీల చట్టం 1965 ప్రకారం స్థానిక సంస్థల రాబడులను (పీఆర్ఐలు మరియు పట్టణ స్థానిక సంస్థలు) ఒక నిధిలో ఉంచాలి (పీఆర్ఐలకు సంబంధించి సాధారణ నిధి, పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించి మునిసిపల్ నిధి). ఈ సంస్థలను నియంత్రిస్తున్న చట్టాల ప్రకారం, వీటి నిధులన్నీ పీడీ ఖాతాల రూపంలో ఉంటాయి. ఖాతాలో చూపించి, ఖజనాలో జమ చేసిన తర్వాతకాని ఈ నిధినుంచి ఖర్చు చేయరాదు.

సాధారణ నిధి, మునిసిపల్ నిధుల నిర్వహణకు సంబంధించి 20 గ్రామ పంచాయితీలు, 38 పట్టణ స్థానిక సంస్థల్లో మచ్చుకు నిర్వహించిన ఆడిట్ పరిశీలనలో, నిధుల నిర్వహణలోనూ, రాబడులను ఖాతాల్లో చూపించడంలోనూ అనేక అవకతవకలు వెలుగు చూశాయి. వాటిలో కొన్ని ముఖ్యమైనవి కింద ఉదహరించబడ్డాయి.

- ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్(ఏపీపీఆర్) చట్టానికి విరుద్ధంగా నిధి/పీడీ ఖాతాలో జమ చేయవలసిన రెవెన్యూ రాబడులను సేవింగ్ బ్యాంక్ ఖాతాలో వేయడం ద్వారా నిధులను ప్రభుత్వ ఖాతా వెలుపల ఉంచినట్లయింది. మచ్చుకు తనిఖీ చేసిన గ్రామ పంచాయితీల్లో[7] ₹ 3.72 కోట్ల మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాకు వెలుపల ఉంచడం జరిగింది.
- నిధి/పీడీ ఖాతాలో జమ చేయకుండా 'క్యాష్ ఇన్ హ్యాండ్ ' గా పెద్ద మొత్తాలను తమ వద్ద ఉంచుకున్నారు. 2012-13 సంవత్సరంలో అలా ఉంచుకున్న మొత్తం ₹ 15.84 లక్షలు (శంషాబాద్ : ₹ 9.24 లక్షలు; వైరా : ₹ 6.60 లక్షలు).

[6] ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కోడ్‌లోని 271(4) అధికరణం

[7] శంషాబాద్ : ₹ 42.94 లక్షలు; ఇబ్రహీమ్‌పట్నం : ₹ 31.42 లక్షలు; బోడుప్పల్ : ₹ 2.98 కోట్లు

- మచ్చుకు తనిఖీ చేసిన 20 గ్రామ పంచాయితీల్లో పంతొమ్మిదింటిలో వసూలు చేసిన పన్ను మొత్తాలను ఖజానాలోని నిధి/పీడీ ఖాతాలో జమ చేయడంలో జాప్యం జరుగుతోంది. ఈ జాప్యం ఒక రోజు (ఇబ్రహీంపట్నం) నుండి 488 రోజుల (శంషాబాద్) వరకు ఉంది.

- కొన్ని గ్రామ పంచాయితీలు వసూలు చేసిన పూర్తి పన్ను మొత్తాలను నిధి/పీడీ ఖాతాకు జమ చేయలేదు. ఇది నిధుల దుర్వినియోగం కిందికి వస్తుంది. మచ్చుకు తనిఖీ చేసిన గ్రామ పంచాయితీల్లో అలా జమ చేయని మొత్తం 2010-11 నుండి 2012-13 మధ్య ₹ 5.39 లక్షలు కాగా బోడుప్పల్ గ్రామ పంచాయతీలో ₹ 1.52 లక్షల పన్ను మొత్తం (2008-09 నుండి 2012-13 మధ్య) దుర్వినియోగమైంది.

- నిధి/పీడీ ఖాతాకు సంబంధించిన క్యాష్ పుస్తకాల్లో ప్రారంభ, ముగింపు నిల్వల మధ్య శంషాబాద్ గ్రామ పంచాయితీలో ₹ 10 లక్షల వ్యత్యాసం ఉంది.

- మచ్చుకు తనిఖీ చేసిన ఏ గ్రామ పంచాయితీలోనూ ఖజానా పాస్ పుస్తకంతో నిధి/పీడీ ఖాతా నగదు పుస్తకంలోని లెక్కలను రికన్సయిల్ చేసుకోలేదు. అందువలన ఈ ఖాతాలలోని మిస్సింగ్ క్రెడిట్‌లు, డెబిట్‌లు గ్రామ పంచాయతీ దృష్టికి వచ్చే అవకాశం ఉండదు.

మంజూరు చేసిన ప్రయోజనానికి వినియోగించుకోకుండా అనేక సంవత్సరాల పాటు ఈ ఖాతాలో నిధులను వుంచినట్లు పీడీ ఖాతాల నిర్వహణ మీద మచ్చుకు చేసిన ఆడిట్ రివ్యూలో వెల్లడైంది. ఇలాంటి కొన్ని కేసులు వివరణాత్మకంగా కింద ఉదహరించబడ్డాయి.

i. ***మంజూరు చేసిన ప్రయోజనానికి నిధులను వినియోగించుకోకపోవడం :*** 2003-12 మధ్యకాలంలో ఇ-పంచాయత్ ప్రాజెక్టు కొరకు విడుదలైన 11 మరియు 12వ ఆర్థిక సంఘం గ్రాంట్ల మొత్తం ₹ 67.36 కోట్లను, ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) జిల్లా ప్రజా పరిషత్, రంగారెడ్డి జిల్లా పీడీ ఖాతా (ఖాతా నం.13)లో ఉంచారు. ఈ మొత్తంలో 2012 మార్చి వరకు కేవలం ₹ 6.86 కోట్లు నిర్దేశిత పనికి ఖర్చు చేయగా మిగిలిన మొత్తాన్ని మొదట కమీషనరు పీడీ ఖాతాలో ఉంచి (2013 జనవరి-మార్చి) తర్వాత ఎఫ్‌డీఆర్‌కు బదిలీ చేశారు. 2012-13 మధ్య కాలంలో ముఖ్య కార్యనిర్వహణాధికారి, జిల్లా ప్రజా పరిషత్, రంగారెడ్డి యొక్క సాధారణ నిధి పీడీ ఖాతాలో ₹ 79.41 కోట్ల మిగులు సొమ్ము నిరుపయోగంగా పడివుంది

ii. ***బ్యాంకు మేనేజర్లకు సెల్ఫ్ చెక్కులను జారీ చేయడం :*** ఏదైనా బ్యాంకు మేనేజరు పేరు మీదగాని, స్వంత పేరు మీదగాని చెక్కులను జారీ చేయడాన్ని ప్రభుత్వ ఉత్తర్వులు[8] నిషేధిస్తున్నాయి. ఈ ఉత్తర్వులను ఉల్లంఘింస్తూ అనేక జిల్లా ప్రజా పరిషత్‌లు నిధి/పీడీ ఖాతా నుండి సొమ్మును డ్రా చేయడానికి సెల్ఫ్ చెక్కులను బ్యాంకు మేనేజర్లకు జారీ చేశారు. అలాగే జిల్లా ఖజానాధికారులు సెల్ఫ్ చెక్కుల ద్వారా నిధి/పీడీ ఖాతా నుండి **₹ 599.18 కోట్లను** డ్రా చేశారు

iii. ***కనపడని చెక్కులు :*** జిల్లా ప్రజా పరిషత్, నల్గొండ (నిధి/పీడీ ఖాతా నం.108) చెక్కు జారీ రిజిష్టరు ప్రకారం, 265 చెక్కులకు సంబంధించిన వివరాలు అందుబాటులో లేవు. అందువల్ల వీటి ద్వారా డ్రా చేసిన మొత్తాల వివరాలను కాని, తీసుకున్న వారి వివరాలను కానీ ఆడిట్ పరిశీలించలేక పోయింది

iv. ***కౌంటరు సంతకం లేకుండా చెక్కులను డ్రా చేయడం :*** ₹ 10 లక్షలు, అంతకు మించిన మొత్తాలకు చెక్కును డ్రా చేసేటప్పుడు విధిగా దానిపై ప్రభుత్వ కార్యదర్శి, ఆర్థిక శాఖ యొక్క కౌంటరు సంతకం ఉండాలి. ఐతే, 2012-13 కాలంలో ప్రతి చెక్కులోను ₹ 10 లక్షలకు మించివున్న మొత్తాలు కలిగి ఉన్న 36 చెక్కుల ద్వారా **₹ 376.40 కోట్ల** నిధులు ఆర్థిక శాఖ కార్యదర్శి సంతకం లేకుండా డ్రా చేయడాన్ని జిల్లా ఖజానాధికారి (పట్టణ) హైదరాబాదు అనుమతించడం జరిగింది.

[8] జీఓఎమ్ఎస్ నం.43 ఆర్థిక మరియు ప్రణాళిక (డబ్ల్యూ&ఎమ్) శాఖ, తేది 22-04-2000

v. *మిగులు నిధులను అంగీకరించే ధృవపత్రం అందకపోవడం (సీఏబీలు)* : నిర్ణీత సమయంలో నిర్వహణాధికారి నుండి మిగులు నిధులకు సంబంధించి ధృవీకరణ పత్రం అందకపోతే, జిల్లా ఖజానాధికారులు తదుపరి చెల్లింపులను నిలిపి వేయవచ్చు. 9,631పీడీ ఖాతా నిర్వహణాధికారుల నుండి సీఏబీలు అందకపోయినప్పటికీ, సంబంధిత జిల్లా ఖజానాధికారులు పీడీ ఖాతాలనుండి సొమ్మును డ్రా చేసుకోవడాన్ని అనుమతించారు

vi. *సామాజిక భద్రత పెన్షన్లు-వినియోగంకాని పెన్షన్ నిధులను ప్రభుత్వ ఖాతాకు బయట ఉంచటం*: రాష్ట్ర ప్రభుత్వం 2006లో అన్ని పెన్షను పథకాలనూ గ్రామీణాభివృద్ధి శాఖ కిందికి తెచ్చింది. పెన్షను పథకాలకు నిధులను విడుదల చేసి, పర్యవేక్షించే బాధ్యతను ఇదే శాఖకు అనుబంధంగా పనిచేస్తున్న 'గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ' (సెర్ప్) అనే సొసైటీకి అప్పగించింది. సెర్ప్ సంస్థకు చెందిన ఎస్‌బీ ఖాతాలో 2012 ఫిబ్రవరి నుంచి 2013 మార్చి మధ్యన ₹ 153.29 కోట్లు చెల్లింపులు కాకుండా ఉన్నాయి. ఈ మొత్తం ప్రభుత్వ పద్దులకు బయట ఉన్నది కనుక దీనిని వెంటనే తమ ఖాతాలోకి తిరిగి తీసుకునేవిధంగా ప్రభుత్వం చొరవచూపాలి.

*ప్రతి పీడీ ఖాతాలోని నిల్వను పరిశీలించిన తర్వాతనే ఆ ఖాతాల చెక్కులను ఆన్‌లైన్ ద్వారా క్లియర్ చేస్తున్నామని ప్రభుత్వం తన లిఖిత పూర్వక సమాధానంలో పేర్కొంది (2013 డిశంబరు). అన్ని పీడీ ఖాతాలను పరిశీలించేందుకు ఒక టాస్క్ ఫోర్స్‌ను నెలకొల్పామనీ, దాని సిఫార్సుల మేరకు పీడీ ఖాతాలను గాడిన పెట్టేందుకు ఆదేశాలు జారీ చేశామనీ ప్రభుత్వం సమీక్షానంతర సమావేశంలో (2013 డిశంబరు) బదులిచ్చింది. అంతేకాకుండా, పీడీ ఖాతాల విషయం, ప్రత్యేకించి స్థానిక సంస్థల ఖాతాలను పరిశీలించమని రాష్ట్ర ఆడిట్ శాఖ అధిపతిని సైతం కోరామనీ, వారినుంచి నివేదిక వచ్చాక తగిన చర్యలు చేపట్టగలమని కూడా ప్రభుత్వం హామీ ఇచ్చింది.*

## 3.6 వివరణాత్మక కంటింజంట్ బిల్లుల బకాయిలు

సంక్షిప్త ఆకస్మిక (ఏసీ) బిల్లులపై తీసుకున్న మొత్తాలతో చేసిన ఖర్చులకు ప్రభుత్వ ఆదేశాలననుసరించి[9] వివరణాత్మక బిల్లులను, (డీసీ బిల్లులు) ఓచర్లతోసహా, ఒక నెలలోపు పీఏజీ (ఏ&ఇ)/పీఏఓకు సమర్పించి, సర్దుబాటు చేయాలి. మొదటి ఏసీ బిల్లుకు డీసీ బిల్లు సమర్పించకుండా మూడవ ఏసీ బిల్లును ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించరాదు.

ఐతే, ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి అనేక పర్యాయములు తీసుకువచ్చినప్పటికీ, 2013 మార్చి 31 నాటికి ₹ 1,210 కోట్ల విలువైన ఏసీ బిల్లులకు డీసీ బిల్లులు సమర్పించవలసి ఉంది. సంవత్సరాలవారీ వివరాలు ఈ దిగువ ఉన్నాయి.

**పట్టిక 3.1 : ఏసీ బిల్లులపై పొందిన సొమ్ము**

**(₹ కోట్లలో)**

| సంవత్సరం | డ్రా చేసిన ఏసీ బిల్లులు | | సమర్పించిన డీసీ బిల్లులు | | బకాయిలో ఉన్న డీసీ బిల్లులు | |
|---|---|---|---|---|---|---|
| | సంఖ్య | సొమ్ము మొత్తం | సంఖ్య | సొమ్ము మొత్తం | సంఖ్య | సొమ్ము మొత్తం |
| **2007-08 వరకు** | 89,837 | 793 | 72,463 | 655 | 17,374* | 138* |
| **2008-09** | 7,383 | 158 | 6,088 | 145 | 1,295 | 13 |
| **2009-10** | 4,447 | 458 | 3,732 | 362 | 715 | 96 |
| **2010-11** | 3,158 | 774 | 2,599 | 659 | 559 | 115 |
| **2011-12** | 2,546 | 941 | 2,025 | 473 | 521 | 468 |
| **2012-13** | 2,285 | 658 | 1,018 | 278 | 1,267 | 380 |
| మొత్తం | **1,09,656** | **3,782** | **87,925** | **2,572** | **21,731** | **1,210** |

*మూలం : పీఏజీ (ఏ&ఇ) కార్యాలయం ఇచ్చిన సమాచారం*

** 2002-03 సంవత్సరం వరకు డ్రా చేసిన ₹ 222 కోట్ల విలువైన 82,130 ఏసీ బిల్లులుకాక (వీటి వివరాలు అందుబాటులో లేవు).*

*గమనిక : 2004-13 మధ్యకాలానికి పీఏఓ (హైదరాబాదు)కు సంబంధించిన ₹ 44 కోట్ల విలువైన 237 ఏసీ బిల్లులు రికన్సిలియేషన్‌లో ఉన్నందున వాటిని చేర్చలేదు.*

[9] జీఓఎమ్ఎస్ నెం.285, ఆర్థిక (టీఎఫ్ఆర్-II) శాఖ, తేది 15.10.2005, ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ కోడ్, రూలు 16, సబ్ రూలు 18 (డి) మరియు జీఓఎమ్ఎస్ నెం.లు 391, 507, 2002 ఏప్రిల్/మే, ఆర్థిక శాఖ

2013 మార్చి నాటికి డీసీ బిల్లులు సమర్పించని శాఖల్లో వ్యవసాయ శాఖ ₹ 831 కోట్లతో ముందుండగా, ₹ 224 కోట్లతో రెవెన్యూ శాఖ, ₹ 59 కోట్లతో సెకండరీ విద్యాశాఖ రెండు మూడు స్థానాల్లో ఉన్నాయి. శాఖల వారీగా బకాయిల్లో ఉన్న డీసీ బిల్లుల వివరాలు ***అనుబంధం 3.5*** లో ఇవ్వబడ్డాయి. జిల్లాలవారీగా చూస్తే అనంతపురం జిల్లాలో అత్యధికంగా ₹ 283.63 కోట్లు విలువైన ఏసీ బిల్లులకు డీసీ బిల్లులు సమర్పించవలసి ఉంది.

పది సంవత్సరాల కాలహరణం తర్వాత కూడ డీసీ బిల్లులు సమర్పించక పోవడంవల్ల, వాటిపై డ్రా చేసిన మొత్తాల వినియోగ ఖచ్చితత్వంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. 2012-13 కాలానికి ఖజానాలు మరియు పీఏఓ/హైదరాబాదు యొక్క పనితీరును సమీక్షించగా కింది విషయాలు వెలుగు చూశాయి.

i. మొదటి ఏసీ బిల్లుపై డ్రా చేసిన మొత్తాలు అపరిష్కృతంగా ఉండగా మూడవ ఏసీ బిల్లును అనుమతించరాదన్న ప్రభుత్వ ఉత్తర్వులను అతిక్రమించి జిల్లా ఖజానాధికారులు 17,449 ఏసీ బిల్లులకు సంబంధించి డ్రాచేసిన ₹ 3,782 కోట్లకు గాను ₹ 531.43 కోట్లు చెల్లింపులు చేశారు.

ii. కరువు లాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు తాగునీటి సరఫరా, మేటను తొలగించి నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించడం వంటి వాటికి సహాయం చేయడం కోసం ప్రభుత్వం ఇతర గ్రాంట్ల కింద ప్రత్యేకమైన బడ్జెట్‌ను కల్పించగా, మహబూబ్‌నగర్ వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు 2009-13 కాలంలో 60 ఏసీ బిల్లుల ద్వారా ₹ 227.12 కోట్లు డ్రా చేసి, అందులో ₹ 101.55 కోట్లకు సంబంధించి డీసీ బిల్లులను 2013 జూన్ నాటికి సమర్పించవలసి ఉంది.

iii. ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా రైతులకు ఇన్‌పుట్ సబ్సిడి చెల్లించడానికి, అనంతపురం (₹ 187.26 కోట్లు), శ్రీకాకుళం (₹ 106 కోట్లు) వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు, శ్రీకాకుళం (₹ 71 లక్షలు) వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఏసీ బిల్లుల ద్వారా సొమ్మును డ్రా చేశారు (2011 జూన్ నుండి 2012 నవంబరు వరకు). ఐతే, 2013 మార్చి 31 నాటికి కూడ వీటికి సంబంధించిన డీసీ బిల్లులను సమర్పించలేదు.

iv. వ్యవసాయ శాఖ కమీషనరు మరియు డైరెక్టర్ ₹ 115.53 కోట్లు విడుదల (2011 మే, జూన్ మరియు 2012 ఏప్రిల్) చేయగా అందులో ఖర్చుకాని ₹ 4.32 కోట్ల మిగులును, శ్రీకాకుళం వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు, ప్రభుత్వ ఖాతాలో జమ చేయడానికి బదులు బ్యాంకు[10]లో డిపాజిట్ చేశారు. డీసీ బిల్లు లేని కారణంగా ఖర్చు చేసిన మొత్తాన్ని కాని, మిగులు మొత్తాన్ని కాని ఆడిట్‌లో నిర్ధారించుకోలేక పోయాము.

v. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను అధిగమించడానికి వైపరీత్యాల సహాయనిధి నుండి ఏసీ బిల్లు ద్వారా 2010 ఏప్రిల్‌లో ₹ 3.93 కోట్లను మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరు డ్రా చేసి ఆ మొత్తాన్ని బ్యాంకు ఖాతాలో ఉంచారు. రెండు సంవత్సరాలలో పై మొత్తం నుండి ₹ 3.68 కోట్లు వినియోగించుకోగా 2013 జూన్ నాటికి ₹ 25 లక్షలు నిరుపయోగంగా బ్యాంక్ ఖాతాలో పడి వున్నాయి. డ్రా చేసిన మొత్తానికి డీసీ బిల్లు సమర్పించవలసి ఉంది.

*ఈ విషయాన్ని ఆర్థిక శాఖ నిరంతరం సమీక్షిస్తున్నదనీ, వివిధ శాఖాధిపతుల దగ్గర పెండింగులో ఉన్న ఏసీ బిల్లుల పరిష్కారానికి కృషి చేస్తున్నదనీ ప్రభుత్వం బదులిచ్చింది (2013 డిశంబరు).*

## 3.7 ఓమ్నిబస్ - చిన్న పద్దు - 800 నిర్వహణ

అందుబాటులో ఉన్న చిన్న పద్దుల కింద వర్గీకరించలేని ఖర్చుకు ఓమ్నిబస్ - చిన్నపద్దు - 800 లో స్థానం కల్పించడం జరుగుతోంది. 2012-13 లో ₹ **18,206** కోట్ల వ్యయాన్ని (మొత్తం ఖర్చులో 15.45 శాతం) రెవెన్యూ, క్యాపిటల్ విభాగాలలోని 50 ప్రధాన పద్దులకు సంబంధించి "ఓమ్నిబస్ - చిన్నపద్దు - 800 - ఇతర ఖర్చులు " కింద వర్గీకరించారు. అదే విధంగా, ₹ **4,123** కోట్ల రెవెన్యూ రాబడులను (మొత్తం రెవెన్యూ రాబడుల్లో 3.97 శాతం) 45 పెద్ద పద్దుల

[10] ఏపీజీవీబీ, శ్రీకాకుళం ₹ 3.58 కోట్లు మరియు ఎస్‌బీఐ, శ్రీకాకుళం ₹ 0.74 కోట్లు

కింద "ఓమ్నిబస్ - చిన్నపద్దు - 800 - ఇతర రాబడులు " కింద వర్గీకరించారు. భారీ మొత్తాలను "ఓమ్నిబస్ - చిన్నపద్దు - 800 - ఇతర ఖర్చులు/ఇతర రాబడులు" కింద వర్గీకరించడం వలన ఆర్థిక నివేదనలో పారదర్శకత లోపించి, కేటాయింపుల ప్రాధాన్యతను, ఖర్చు యొక్క నాణ్యతను విశ్లేషించడం కష్టమౌతుంది.

*ప్రభుత్వం2013-14 బడ్జెట్ అంచనాలు ఖరారు చేస్తున్న దశలో చిన్న పద్దు-800 నిర్వహణ విషయమై దిద్దుబాటు చర్యలు తీసుకున్నామని తెలిపింది (2013 డిశంబరు). వివిధ పథకాలను 2014-15 నుంచి సంబంధిత చిన్న పద్దులకు బదిలీ చేసే విషయంలో ఆయా శాఖాధిపతులను సంప్రదించి తగిన చర్య తీసుకుంటామని హామీ ఇచ్చింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి సీఎఫ్ఎమ్ఎస్ అమలులోకి వస్తే ఈ విధమైన వ్యవస్థీకృత లోపాలను అధిగమించవచ్చని కూడా ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.*

## 3.8 భారత ప్రభుత్వ అకౌంటింగ్ ప్రమాణాలను (ఐజీఏఎస్) అమలు చేయడం

### 3.8.1 రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పూచీలు

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలను సెక్టార్ల వారీగాను, వర్గాలవారీగాను 2011-12 నుండి ఆర్థిక పద్దులలో వెల్లడించాలని ఐజీఏఎస్ - 1 నిర్దేశిస్తోంది. సెక్టార్ల వారీగా ఇప్పటికే చూపుతున్నప్పటికీ, వర్గాలవారీ వివరాలను ఇంత వరకూ రాష్ట్ర ఆర్థిక పద్దులలో చేర్చలేదు.

### 3.8.2 సహాయ గ్రాంట్ల వర్గీకరణ, అకౌంటింగ్

ఐజీఏఎస్ - 2 ప్రకారం, భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ సలహా మేరకు, రాష్ట్రపతి ప్రత్యేకంగా అనుమతించిన కేసుల్లో తప్ప, స్థిరాస్తుల కోసమైనా సరే, గ్రాంట్లకు సంబంధించి చేసిన ఖర్చును రెవెన్యూ ఖర్చు కింద వర్గీకరించాలి. ఐతే రాష్ట్ర ప్రభుత్వం ₹ 1.47 కోట్ల ఖర్చును రెవెన్యూ సెక్షన్‌కు బదులు, క్యాపిటల్ సెక్షన్‌లో వర్గీకరించింది.

## 3.9 అప్పు, డిపాజిట్ మరియు జమల పద్దులు

2012-13లో అప్పులు, డిపాజిట్‌లు, జమలు పద్దులను ఆడిట్‌లో పరిశీలించగా కింది విషయాలు వెలుగు చూశాయి.

### 3.9.1 ప్రజా రుణం

రాష్ట్ర శాసన సభ ఎప్పటికప్పుడు చట్టం ద్వారా నిర్ణయించిన పరిధులకు లోబడి, రాష్ట్ర సంచిత నిధి పూచీకత్తుపై, భారత భూభాగంలో ఎక్కడినుండైనా నిధులు అప్పుగా సమకూర్చుకోడానికి భారత రాజ్యాంగంలోని 293 వ అధికరణం రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం కల్పిస్తోంది.

#### *3.9.1.1 పెద్దపద్దు 6003 - అంతర్గత రుణం కింద రుణాత్మక మిగులు :*

అప్పు పద్దుల కింద రుణాత్మక (మైనస్ మిగుళ్లు) మిగులు నిధులు, ప్రభుత్వం చేసిన అప్పుల కంటే చెల్లింపులు ఎక్కువగా ఉండడాన్ని సూచిస్తాయి. నేరుగా రుణం పొందగల ప్రభుత్వ శాఖలు అట్టి రుణాలను వారి రాబడులుగా వర్గీకరిస్తుండగా, ఎస్‌పీవీలు, కంపెనీలు/కార్పొరేషన్లు వారి అప్పులను ప్రభుత్వ లెక్కలలో చూపడం లేదు. ఐతే, అప్పు చెల్లింపులను పెద్ద పద్దు 6003 - అంతర్గత రుణం కింద డెబిట్‌గా ప్రభుత్వ లెక్కల్లో చూపడం రుణాత్మక మిగుళ్లకు దారి తీస్తోంది. 2012-13లో చెల్లింపులను లెక్కలలో చూపి క్రెడిట్‌లను చూపకపోవడంవల్ల పెద్ద పద్దు "6003 - 109 - ఇతర సంస్థల నుండి పొందిన రుణం" కింద ₹ 3,896 కోట్లు రుణాత్మక మిగులు కనిపించింది. పై మిగుళ్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ రహదారుల అభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఫైనాన్స్ సంస్థ మరియు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సరఫరా సంస్థ మొదలైన శాఖలకు సంబంధించినవి.

*ఇది ఎన్నో సంవత్సరాలుగా జరుగుతున్న విషయమనీ దీన్ని సరిదిద్దడానికి ప్రయత్నం జరుగుతోందనీ ప్రభుత్వం సమీక్షారంభ సమావేశంలో తెలిపింది (2013 ఆగస్టు). రెవెన్యూ మిగులుమీద ప్రభావం చూపుతుంది కనుక ఈ వ్యయాన్ని రెవెన్యూ పద్దులో రాయటం కష్టమని ప్రభుత్వం సమీక్షానంతర సమావేశంలో తెలిపింది (2013 డిశంబరు). ఐతే ఈ విధమైన ఋణాత్మక మిగుళ్ళను సరిచేసేందుకు మార్గాలను అన్వేషిస్తున్నామని కూడా ప్రభుత్వం పేర్కొంది.*

## 3.9.2 డిపాజిట్లు, అడ్వాన్సులు

### *3.9.2.1 డిపాజిట్లు*

ప్రజల నుంచి కాని, ప్రభుత్వ సంస్థల నుంచి కాని లేక వాటి తరపున కాని ప్రభుత్వం అనేక సందర్భాలలో డిపాజిట్లను స్వీకరిస్తుంది. వీటిని తిరిగి చెల్లించడం ద్వారాగాని మరే యితర పద్ధతిలోకాని ప్రభుత్వ లెక్కలలో చూపాలి. ఒక సంవత్సరానికికాని, కొన్ని సంవత్సరాలకుకాని చెందిన రెవెన్యూల నుంచి అలా స్వీకరించిన మొత్తాలను ఒక నిధి కింద జమయ్యేలా ప్రభుత్వం ఒక్కొక్కసారి నిర్ణయిస్తుంది. అలాంటి మిగులు నిధులను డిపాజిట్ కింద నిర్వహించి నిర్దేశిత ప్రయోజనాలకు ఖర్చు చేస్తారు.

డిపాజిట్లను, అడ్వాన్సులను మూడు విభాగాలుగా విభజించారు. ఈ విభాగాల వివరాలు, వీటి కింద నిల్వ వున్న మిగులు నిధుల వివరాలు 2013 మార్చి 31 నాటికి కింది విధంగా వున్నాయి.

| | | |
|---|---|---|
| **వడ్డీతో కూడిన డిపాజిట్లు** | **₹ 4,145.79 కోట్లు** | క్రెడిట్ మిగులు |
| **వడ్డీ లేని డిపాజిట్లు** | ₹ 11,447.45 కోట్లు | క్రెడిట్ మిగులు |
| **అడ్వాన్సులు** | ₹ 22.97 కోట్లు | డెబిట్ మిగులు |

2012-13 లో 'డిపాజిట్ల' కింద ఉన్న మిగులు నిధులను ఆడిట్ లో సమీక్షించగా కింది విషయాలు వెలుగు చూశాయి.

- ***డిపాజిట్ ఖాతాల్లోని రుణాత్మక లెడ్జరు మిగుళ్లు :*** 2013 మార్చి 31 నాటికి డిపాజిట్ల కింద ₹ 2,264.54 కోట్ల రుణాత్మక మిగులు ఉంది. డిపాజిట్ ఖాతాలో ధనాత్మక మిగులుకాని లేక మిగులు లేకపోవడం కాని జరుగుతుంది. రుణాత్మక మిగులు డిపాజిట్ మొత్తానికంటే ఖర్చు అధికమని సూచిస్తుంది. జిల్లా ఖజానా/పీఏఓలలో జరిగిన అధిక చెల్లింపుల వల్ల కాని, తప్పుగా వర్గీకరించటం వల్ల కాని ఈ విధంగా జరుగుతుంది. ఈ విధమైన ఋణాత్మక మిగుళ్ళ విషయం పరిశీలించి ప్రభుత్వం తగు దిద్దుబాటు చర్యలు గైకొనాలి.

- ***చెల్లింపులకు ప్రతిగా చెక్కులను పొందకపోవడం :*** ఖజానా పద్దుల నియమావళి[11] ప్రకారం, చెల్లింపుల పూర్తి వివరాలను కలిగివున్న వోచర్లు/చెక్కుల ఆధారంగానే చెల్లింపులు జరగాలి. **₹ 327** కోట్ల విలువైన 4,583 చెక్కులను ఖజానాలు పీఏజీ (ఏ&ఇ) కి సమర్పించలేదు. వీటిలో 4238 చెక్కులు గత మూడు సంవత్సరాలకు చెందినవే. వీటి విలువ ₹ 313.46 కోట్లు. దీనికి సంబంధించి సమర్పించవలసిన చెక్కుల వివరాలు సంవత్సరాల వారీగా ***అనుబంధం 3.6*** లో ఇవ్వబడ్డాయి.

- ***క్లెయిము చేయని సాధారణ భవిష్యనిధి (జీపీఎఫ్) డిపాజిట్లు :*** 2000 ఏప్రిల్‌లో ఇచ్చిన ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా, సాధారణ భవిష్యనిధిలోని ₹ 1.27 కోట్ల క్లైము చేయని డిపాజిట్లను రాష్ట్ర సంచిత నిధిలో జమ చేయలేదు.

[11] ఖజానా పద్దుల నియమావళి (వాల్యూం-I)లోని పేరా 197(i)(ఎ)

### *3.9.2.2 సివిల్ అడ్వాన్సులు*

ఏపీ ఫైనాన్షియల్ కోడ్ లోని 236 వ అధికరణం ప్రకారం, ప్రజా ప్రయోజనార్థం జరిపే ప్రభుత్వ లావాదేవీల కొరకు తాత్కాలిక నగదు అడ్వాన్సు రూపంలో కొంత మొత్తాన్ని (ప్రభుత్వ ఉద్యోగుల వినియోగార్థం) ఉంచవలసిన అవసరం ఉంటుంది. వీటిని సంబంధిత ఖాతా పద్దుల కింద ఖర్చుగా చూపడం ద్వారా గాని లేక సంబంధిత వ్యక్తులనుండి రికవరి చేయడం ద్వారాగాని సర్దుబాటు చేయాలి. ₹ 9.18 కోట్ల విలువైన సివిల్ అడ్వాన్సులు, మూడు సంవత్సరాల కంటే ఎక్కువ కాలంనుండి నిర్వహణలేని ఖాతా పద్దులలో పడి ఉన్నాయి. ప్రభుత్వం ఈ అడ్వాన్సులను పరిశీలించి తగు చర్య తీసుకోవాలి.

### 3.9.3 జమలు

జమల కింద జరిగే అన్ని లావాదేవీలు సర్దుబాటు చేయగల ఖాతా పద్దుల కింద నిర్వహించబడతాయి. వీటి కింది డెబిట్ లేక క్రెడిట్‌లు తత్సంబంధిత క్రెడిట్ లేక డెబిట్‌ల ద్వారా అదే అకౌంటింగ్ సర్కిల్‌లో గాని వేరొక అకౌంటింగ్ సర్కిల్‌లో గాని వెనువెంటనే సర్దుబాటు చేయబడతాయి. జమాపద్దుల కింది నిల్వలపై జరిపిన ఆడిట్ పరిశీలనలో కింది విషయాలు వెలుగుచూశాయి.

- ***ఖజానాలతో చేసుకున్న సెటిల్‌మెంటు జాబితాను సమర్పించటంలో జాప్యం (ఎస్ఎస్‌టీలు) :*** 2013 మార్చి 31 నాటికి ఖజానాలు/పీఏఓల నుండి ఎస్ఎస్‌టీలు రాని కారణంగా మొత్తం 1,574 ఎస్ఎస్‌టీ[12] లకు సంబంధించిన ₹ 1,368.60 కోట్ల (₹ 63.77 కోట్లు అటవీ శాఖ జమలు/చెక్కుల కింద, ₹ 1,304.83 కోట్లు ప్రజా పనుల చెక్కుల కింద) ను సర్దుబాటు చేయవలసి వుంది. 2006-07 నుంచి ఈ నిల్వలు అపరిష్కృతంగా ఉన్నాయి.

- ***ప్రజా పనులు, అటవీ శాఖ :*** 2013 మార్చి 31 నాటికి ఖజానాలో జమచేసిన ₹ 668.76 కోట్లు (ప్రజా పనులు) మరియు ₹ 4.04 కోట్లు (అటవీ శాఖ) సర్దుబాటు కాలేదు. ఎస్ఎస్‌టీలు రాని కారణంగానూ, వర్గీకరణ దోషం వల్లనూ ఇవి 2006-07 నుంచి సర్దుబాటు కాలేదు.

- ***ప్రజా పనుల, అటవీ శాఖల చెక్కులు :*** పీఏఓ/ఖజానాల తప్పుడు వర్గీకరణ మరియు ఎస్ఎస్‌టీలు సమర్పించని కారణంగా 2006-07 నుంచి ప్రజా పనులకు సంబంధించిన ₹ 636.07 కోట్ల విలువైన చెక్కులు, అటవీ శాఖకు చెందిన ₹ 40.74 కోట్ల విలువైన చెక్కులు 2013 మార్చి 31 నాటికీ సర్దుబాటు కాలేదు.

- ***ఇతర జమలు :*** కాంట్రాక్టర్లు, ఇతరులు లాంటి మూడవ వ్యక్తులు నేరుగా ఖజానాలో జమ చేసిన మొత్తాలకు సంబంధించిన లావాదేవీలు ఈ పద్దుల కిందికి వస్తాయి. ఐటమ్ వారీ వివరాలు లేని కారణంగా ₹ 166.52 కోట్లు మొత్తం 2013 మార్చి 31 నాటికీ సర్దుబాటు కాలేదు.

- ***కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సర్దుబాటు ఖాతా :*** రాష్ట్ర ఖజానాల్లో జరిపిన కేంద్ర సివిల్ పెన్షన్ చెల్లింపులు, డీజీఎస్‌డీ చేసిన సరఫరాల విలువ, రాష్ట్రానికి కేంద్రం విడుదల చేసిన రుణాలు, లోన్లు/వడ్డీ తిరిగి చెల్లింపులు, కేంద్రం మంజూరు చేసిన సహాయ గ్రాంట్లు మరియు కేంద్రం రాబడుల్లోని రాష్ట్ర వాటాలు మొదలైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరిగే లావాదేవీలు ఈ పద్దు కిందికి వస్తాయి. 2013 మార్చి 31 నాటికి ఈ పద్దు కింద ₹ 4.18 కోట్ల క్రెడిట్ మరియు ₹ 16.94 లక్షల డెబిట్ నిల్వలు ఐదు సంవత్సరాలకు పైబడి సర్దుబాటు కాకుండా ఉన్నాయి.

సర్దుబాటు కాకుండా ఉన్న నిల్వలను పరిశీలించి ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

---


[12] అటవీశాఖవి 1,052, ప్రజాపనులశాఖవి 522

## 3.10 సస్పెన్స్ పద్దు (ప్రధాన పద్దు 8658) కింద నిల్వవున్న మిగులు మొత్తాలు

ఏ కారణంచేతైనా, లావాదేవీ జరిగిన వెంటనే ప్రభుత్వ ఖాతాలో సంబంధిత పద్దుకింద బుక్ చెయ్యలేని పరిస్థితివుంటే అటువంటి లావాదేవీల కోసం సస్పెన్స్ ఖాతాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ మొత్తాలను సంబంధిత పద్దులకింద సర్దుబాటు చేసేటప్పుడు సస్పెన్స్ ఖాతాకు మైనస్ డెబిట్ లేక మైనస్ క్రెడిట్ ఇవ్వడం జరుగుతుంది. ఒకవేళ ఈ సస్పెన్స్ ఖాతాలో మొత్తాలు సర్దుబాటు కాకుండా ఉండిపోతే, ఈ పద్దులకింద నిల్వ మొత్తాలు పెరిగి, ఆమేరకు ప్రభుత్వ రాబడులు, ఖర్చులు తక్కువచేసి చూపబడతాయి.

2013 మార్చి 31 నాటికి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక పద్దులలో ప్రధాన సస్పెన్స్ పద్దు 8658 కింద ₹ 292.60 కోట్ల (డెబిట్) నికర మొత్తం నిల్వ ఉంది. ఆర్థిక పద్దులు సస్పెన్స్ ఖాతాలలోని నికర నిల్వలను ప్రతిబింబిస్తాయి. అందువల్ల, శాసన సభకు సమర్పించిన వార్షిక పద్దులలో, ఈ సస్పెన్స్ ఖాతాల వాస్తవ విలువలు నివేదించబడవు. గత ఐదు సంవత్సరాలుగా ముఖ్యమైన చిన్న పద్దులకింద డెబిట్, క్రెడిట్ సస్పెన్స్ నిల్వలు ఈ కింది విధంగా ఉన్నాయి.

**చార్టు 3.1 : ప్రధాన పద్దు 8658 కింద సర్దుబాటు కాకుండా ఉన్న మొత్తాలు**




*మూలం : పీఏజీ (ఏ&ఈ) నిర్వహిస్తున్న లెడ్జర్లు, ఆర్థిక పద్దులు*

### 3.10.1 పే & అకౌంట్స్ కార్యాలయం - సస్పెన్స్ (చిన్న పద్దు 101)

భారత ప్రభుత్వ పీఏఓలు, కేంద్ర పాలితప్రాంతాల పీఏఓలు, మహాగణకాధికారుల పుస్తకాల్లో వివిధ శాఖల, ప్రభుత్వాల మధ్య జరిగిన లావాదేవీలను పరిష్కారం చేయడంకోసం ఈ చిన్న పద్దును నిర్వహిస్తారు. ఏ అకౌంట్స్ అధికారి పరంగా ఈ పీఏఓ, సస్పెన్స్ చిన్న పద్దు నిర్వహించబడుతుందో ఆ అధికారి తరపున ఒక అకౌంట్స్ అధికారి చేసిన చెల్లింపులు, పొందిన రికవరీలకు సంబంధించిన లావాదేవీలను ఈ చిన్న పద్దు ప్రతిబింబిస్తుంది. 2012-13 సంవత్సరాంతానికి ఈ పద్దుకింద ₹ 114.50 కోట్ల డెబిట్ నిల్వ, ₹ 15.07 కోట్ల క్రెడిట్ నిల్వ ఉన్నాయి. ఈ పద్దులోని డెబిట్ నిల్వలు ప్రధానంగా పీఏఓ, కేంద్రీయ పింఛనులు, న్యూఢిల్లీ (₹ 56.78 కోట్లు), మరియు పీఏఓ, షిప్పింగ్ & రవాణా, బెంగుళూరు (₹ 26.99 కోట్లు) లకు సంబంధించినవి. అలాగే, క్రెడిట్ నిల్వలు పీఏఓ, ఆర్థిక వ్యవహారాల శాఖకు సంబంధించినవి (₹ 12.65 కోట్లు).

### 3.10.2 సస్పెన్స్ అకౌంటు - సివిల్ (చిన్న పద్దు 102)

తగిన సమాచారం/పత్రాలు (చలాన్లు, ఓచర్లు మొదలైనవి) లేని కారణంగా ఖర్చులు/రాబడులకు సంబంధించిన లావాదేవీలను వాటికి సంబంధించిన వాస్తవ పద్దులకింద బుక్ చెయ్యలేము కనుక, అలాంటివాటిని ముందుగా ఈ సస్పెన్స్ పద్దులో బుక్ చెయ్యడం జరుగుతుంది. 2013 మార్చి 31 నాటికి ఈ పద్దుకింద ₹ 191.37 కోట్లు (డెబిట్), ₹ 91.02 కోట్లు (క్రెడిట్) మిగులు నిల్వలు ఉన్నాయి. అంటే, మొత్తం ₹ 282.39 కోట్లకు సంబంధించిన ఖర్చులు, రాబడులను వేటికవి సంబంధిత వాస్తవ పద్దులకింద సర్దుబాటు చేయవలసి ఉంది. ప్రధానంగా ఈ పద్దుకింద డెబిట్ నిల్వలు ఎఫ్ఏ & సీఏఓ, దక్షిణ మధ్య రైల్వే (₹ 76.28 కోట్లు), ఖర్చులు/సర్దుబాటు చేసిన ఖర్చులు (₹ 42.18 కోట్లు), వేరొక అకౌంటింగ్ వ్యవస్థలోని ఖజానాలో రెమిటెన్సులకు (₹ 55.13 కోట్లు), సంబంధించినవి. కాగా, క్రెడిట్ నిల్వలు వేరొక అకౌంటింగ్ సర్కిల్‌లోని ఖజానా పేరుమీద డ్రాచేసిన చెక్కులు (₹ 56.60 కోట్లు), తుంగభద్ర ప్రాజెక్టు సస్పెన్స్ - జమలు (₹ 12.67 కోట్లు) మరియు తుంగభద్ర ప్రాజెక్టు సస్పెన్స్ (₹ 7.18 కోట్లు) లకు సంబంధించినవి.

### 3.10.3 రిజర్వు బ్యాంకు సస్పెన్స్-సెంట్రల్ అకౌంట్స్ కార్యాలయం (చిన్న పద్దు - 110)

లోన్లు, గ్రాంట్లు మొదలైనవి మంజూరు చేసేటప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పెద్ద మొత్తంలో జరిగే లావాదేవీలను వాటి వాస్తవ పద్దులో రికార్డు చేసేముందు, పెద్ద పద్దు - 8658 కింది చిన్న పద్దైన '110 - రిజర్వు బ్యాంకు సస్పెన్స్ - సెంట్రల్ అకౌంట్స్ కార్యాలయం'లో రికార్డు చేయడం జరుగుతుంది. 2013 మార్చి 31 నాటికి ఈ పద్దుకింద ₹ 333.02 కోట్లు (డెబిట్) మరియు ₹ 305.52 కోట్లు (క్రెడిట్) నిల్వ ఉన్నాయి. అంటే, రుణాల తిరిగి చెల్లింపులు ₹ 333.02 కోట్లు మరియు స్వీకరించిన రుణాలు ₹ 305.52 కోట్లు తక్కువ చేసి చూపినట్లయింది. ఐతే, నిల్వలను బేరీజు వేయడంవల్ల ఆర్థిక పద్దులు ₹ 27.50 కోట్ల డెబిట్ నిల్వను సూచిస్తాయి. ఇది రాష్ట్ర ప్రభుత్వ రుణాలు, రుణాల చెల్లింపుల వాస్తవ స్థితిని ప్రతిబింబించవు.

### 3.10.4 అంతర్‌రాష్ట్ర సస్పెన్స్ - పెద్దపద్దు 8793

ఒక రాష్ట్ర ఖజానాలో వేరొక రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి జరిగిన లావాదేవీల వర్గీకరణ ఈ కేటగిరీలో జరుగుతుంది. ఖజానానుంచి నెలవారీ లెక్కలు అందగానే, బుకింగ్ పూర్తిచేసి, లావాదేవీల పరిశీలన అనంతరం అవసరమైన నిల్వలను ఒక రాష్ట్రం నుంచి వేరొక రాష్ట్రానికి బదిలీ చేయవలసిందిగా రిజర్వు బ్యాంకుకు సలహా యివ్వడం జరుగుతుంది. సర్దుబాటు అయినట్లు రిజర్వు బ్యాంకు నుండి 'క్లియరెన్స్ మెమో' అందగానే ఈ పద్దు కింది మొత్తాలు ఉపసంహరించబడతాయి. రిజర్వు బ్యాంకు నుంచి క్లియరెన్స్ మెమోలు అందని కారణంగా, అంతర్ రాష్ట్ర సస్పెన్స్ పెద్దపద్దు 8793 కింద, 2013 మార్చి 31 నాటికి ₹ 43.03 కోట్లు సర్దుబాటు కాలేదు. ఈ విషయంలో ఖజానాలు రికన్సయిల్ చేసుకుని, నిల్వలను లేకుండా చూడవలసిన అవసరం ఉంది.

### 3.10.5 వాడుకలో లేని ఉప పద్దుల కింద సర్దుబాటు కాని నిల్వలు

వాడుకలో లేని కొన్ని ఉప పద్దుల కింద ₹ 4.29 కోట్ల డెబిట్ నిల్వలు నాలుగు సంవత్సరాలకు పైబడి ఉండి పోయాయి. వాడుకలో లేని అన్ని ఉప పద్దులను సమీక్షించి, వాటిని కొనసాగించవలసిన అవసరాన్ని పరిశీలించటానికి ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలి.

### 3.10.6 చెక్కులు, బిల్లులు

2013 మార్చి 31 నాటికి పెద్దపద్దు 8670 - చెక్కులు, బిల్లులు కింద ₹ 100.58 కోట్ల డెబిట్ నిల్వ ఉంది. 2012-13 లో ₹ 22,494.25 కోట్ల విలువైన చెక్కులు జారీ చేయగా, ₹ 22,717.74 కోట్ల విలువైన చెక్కులు నగదుగా మార్చబడి ₹ 100.58 కోట్ల (డెబిట్) ముగింపు నిల్వ ఉండిపోయింది. పెద్దపద్దు 8670 కింద డెబిట్ నిల్వ, జారీ చేసిన చెక్కుల మొత్తం

కంటే నగదుగా మార్చుకున్న చెక్కుల మొత్తం అధికంగా ఉండడాన్ని సూచిస్తుంది. వర్గీకరణలోని లోపాలుకాని, అధికంగా చెల్లింపులు జరిగే అవకాశాలుకాని ప్రభుత్వం విచారణ ద్వారా తేల్చవలసిన అవసరం ఉంది.

## 3.11 ఆధార పత్రాలు సమర్పించకపోవడం

పైన ఉదహరించినట్లు 'సస్పెన్స్' పద్దు కింద అసంఖ్యాకమైన ఖాతాలు వాటికి సంబంధించిన మొత్తాలు ఉండడమేకాక, 2002-03 నుంచి 2011-12 మధ్య ₹ 4,233.38 కోట్ల ఖర్చుకు సంబంధించి ఆధార పత్రాలను (76,669 ఓచర్లు) ఖజానాధికారులు మహాగణకాధికారి కార్యాలయానికి సమర్పించలేదు. అంతేగాక, ఈసంవత్సరం ₹ 1,608 కోట్ల ఖర్చుకు సంబంధించిన సపోర్టింగ్ ఓచర్లు అందుబాటులో లేవు (మొత్తం 21,751 ఓచర్లలో 2013 సెప్టెంబరు చివరి నాటికి 4,000 ఓచర్లు అందాయి). ఈ ఓచర్లలో ఎక్కువ భాగం సహాయక గ్రాంట్లు, జీత భత్యాల బిల్లులు, పింఛను చెల్లింపులు మరియు కంటింజంట్ బిల్లులకు చెందినవి. లెక్కలు సమర్పించే విభాగాలైన ఖజానాలు, పీఏఓలు, ప్రజా పనులు మరియు అటవీ శాఖ డివిజన్లలో చెల్లింపుల వ్యవస్థను గాడినపెట్టి ఆధార పత్రాలు/ఓచర్లు లేనిదే ఎట్టి ఖర్చును ఆమోదించకుండా ఉండే విధంగా ప్రభుత్వం కట్టుదిట్టం చేయాలి. ఈ ఓచర్లు మోసపూరిత చెల్లింపులకు దారితీయకుండా ఖజానా అధికారులు, ఇంకా సంబంధిత అకౌంట్స్ అధికారులు కలసికట్టుగా కృషిచేసి అన్ని ఓచర్లనూ వెతికితీసి ఆడిట్ పరిశీలనకు అందచేయాలి. లేని పక్షంలో ఈ చెల్లింపులు నిబంధనల మేరకే జరిగాయని ప్రమాణ పత్రం సమర్పించాలి.

*ఈ సమస్యను ఆమూలం పరిశీలించి, దిద్దుబాటు చర్యలు చేపడతామనీ, ప్రస్తుత సంవత్సరపు ఓచర్లతోనే సంస్కరణలు ఆరంభిస్తామనీ ప్రభుత్వం సమీక్షానంతర సమావేశంలో హామీ ఇచ్చింది (2013 డిశంబరు).*

## 3.12 సారాంశం

*నిర్దిష్ట సాంఘిక, ఆర్థికాభివృద్ధి కార్యక్రమాల అమలు కోసం విడుదల చేసిన నిధులకు సంబంధించి భారత ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వానికి దిగువ శ్రేణి అధికారులు వినియోగ ధృవ పత్రాలు సమర్పించకపోవడం, రాష్ట్ర స్వయంపాలక సంస్థలు తమ వార్షిక పద్దులను ఆడిట్‌కు అందచేయడంలో జాప్యం నియమ నిబంధనల అతిక్రమణను సూచిస్తుంది. ఖర్చుకాని పెద్ద మొత్తాలు పీడీ ఖాతాల్లో ఉండడం, డీసీ బిల్లులకు దాదాపు దశాబ్దకాలం జాప్యం చెయ్యడం, పద్దులు సరిగా నిర్వహించకపోవడం మొదలైన వాటివల్ల లబ్ధిదారులకు ప్రయోజనాలు అందకపోవడం, జాప్యం కావడమే కాక వంచన, ప్రజాధనం అపహరణ వంటి వాటికి వ్యవస్థలో అవకాశం ఏర్పడుతోంది.*

*ఓమ్నిబస్ చిన్నపద్దు - '800' ను నిర్వహించిన వైనం ఆర్థిక నివేదనలోని పారదర్శకతపై ప్రభావం చూపుతుంది. ఋణాలు, డిపాజిట్‌లు, జమలు, సస్పెన్స్ ఖాతా పద్దుల్లో వున్న ఋణాత్మక మిగులు మొత్తాలు, మురిగిపోయిన డిపాజిట్లను ప్రభుత్వ ఖాతాలో వెయ్యకపోవటం, ఖజానాలు/పీఏఓలు లెక్కలు సరిచూసుకొని సంబంధిత పత్రాలను సమర్పించకపోవటం, రిజర్వు బ్యాంకు నుండి క్లియరెన్స్ మెమోలు అందకపోవటం మొదలైనవి నియంత్రణా లోపాలను సూచిస్తాయి. దీనివలన ప్రభుత్వ రాబడులు, ఖర్చులు తక్కువచేసి చూపించినట్లవుతుంది. వాడుకలో లేని పీడీ ఖాతాలు, డీడీఆర్ పద్దుల కింద చాలాకాలంగా ఉన్న మిగులు మొత్తాలు పర్యవేక్షక యంత్రాంగం లోపాలను ప్రతిబింబిస్తాయి.*

*రాబడులు, ఖర్చులను రికన్సయిల్ చేసుకోకపోవటం, బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా, నియమ నిబంధనలను అనుసరించి ఉంటామని సీసీఓలు భరోసాయిస్తూ ప్రమాణపత్రాలు అందించకపోవటం చూస్తే రాష్ట్ర ప్రభుత్వంలో నష్ట నివారణ కోసం సరైన యంత్రాంగం లేదని తోస్తున్నది. ఖజానా అధికారులు ₹ 327 కోట్ల మొత్తానికి సంబంధించి 4,583 చెక్కులు ఇవ్వకపోవటం ₹ 5,841 కోట్ల ఖర్చుకు సంబంధించిన 94,420 ఓచర్లు లభించకపోవటం వలన పద్దుల నాణ్యతపట్ల ఆందోళన కలుగుతోంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించవలసిన అవసరం ఉన్నది.*

## 3.13 సిఫార్సులు

1. *ప్రభుత్వ శాఖలు వినియోగ ధృవపత్రాలను, వివరణాత్మక బిల్లులను, పద్దులను సకాలంలో సమర్పించే విషయంలో నియమనిబంధనలు పాటించే విధంగా ప్రభుత్వం కట్టుదిట్టమైన యంత్రాంగం నెలకొల్పాలి. ఓమ్నీబస్ చిన్న పద్దు '800' వినియోగాన్ని తగ్గించుకుని, ఆదాయవ్యయాలను సరైన పద్దులలో నమోదు చేసే విధంగా చర్యలు చేపట్టాలి. ప్రతికూల నిల్వలను గణనీయంగా తగ్గించి ప్రభుత్వ పద్దులలో పారదర్శకతను ఇనుమడింపచేయాలి.*

2. *ఖజానాలు, పీఏఓలు, పబ్లిక్ వర్క్సు, అటవీ డివిజన్ల వంటి విభాగాలలో చెల్లింపు విధానాలను గాడిన పెట్టి తగిన ఓచర్లు, పత్రాలు లేనిదే ఖర్చులను అనుమతించని రీతిలో ప్రభుత్వం కట్టుదిట్టంచేయాలి. ఈ ఓచర్లు మోసపూరిత చెల్లింపులకు దారితీయకుండా ఖజానా అధికారులు, ఇంకా సంబంధిత అకౌంట్స్ అధికారులు కలసికట్టుగా కృషిచేసి అన్ని ఓచర్లనూ వెతికితీసి ఆడిట్ పరిశీలనకు అందచేయాలి. చెల్లింపులు నియమాలమేరకే జరిగాయని ప్రమాణపత్రం ఇవ్వాలి.*

హైదరాబాదు

(వాణీ శ్రీరామ్)
ప్రధాన మహాగణకాధికారి (జీఎస్ఎస్ఏ)
ఆంధ్రప్రదేశ్

ధృవీకరించడమైనది

కొత్త ఢిల్లీ

(శశికాంత్ శర్మ)
భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్